సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024

వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో మాసశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం స్వామి వారి అద్దాల మంటపంలో మహాలింగార్చన వైభవంగా జరిపించారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

నేరాల నియంత్రణే లక్ష్యం

- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



కోనరావుపేట(వేములవాడ): నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తుందని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ధర్మారంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన పత్రాలు, నంబర్‌ప్లేట్ లేని 21 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత గంజాయి, గుడుంబాలకు దూరంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలతో భద్రత పెరుగుతుందని, గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు కిరణ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

వీర్నపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌పై వేటు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి లింగమ్మపై వేటు పడింది. కేజీబీవీ విద్యార్థిని అశ్విత ఇటీవల భవనం పై నుంచి దూకిన సంఘటన నేపథ్యంలో జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. లింగమ్మకు రుద్రంగిలోని కేజీబీవీలో సీఆర్టీగా విధులు కేటాయించారు. ఆమె స్థానంలో వీర్నపల్లిలో పీజీసీఆర్టీగా పనిచేస్తున్న మమతకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సహకార సంఘాల పనితీరు భేష్

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు



ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో సహకార సంఘాల పనితీరు విప్లవాత్మకమని.. రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత సహకార సంఘాలదేనని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. సహకార సంఘాల పాలకవర్గాలు అంకిత భావంతో పనిచేశాయన్నారు. చైర్మన్ తన్నీరు బాపురావు, వైస్‌చైర్మన్ రాజేశంగౌడ్, డైరెక్టర్లు కట్ట బాపురావు, మాధవరావు, నర్సింలు, లక్ష్మణ్‌రావు, కీర్తన్, సతీశ్ చందర్‌రావు, వెంకటరెడ్డి, బాలమల్లు, ఆనంద్, సీఈవో కృష్ణ పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలి



సిరిసిల్లటౌన్: నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ పనులను నిలిపి వేయాలని జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ వాసులు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ సెల్‌టవర్ నిర్మాణంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల ఆమోదం లేకుండా జరుగుతున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని నిర్వాహకులను ఆదేశించాలని కమిషనర్‌ను కోరారు. స్థానికులు రాజు, బాలకృష్ణ, మహేశ్, లక్ష్మణ్ ఉన్నారు.

పది రోజుల్లోగా చెత్తను శుభ్రం చేయాలి

- ఓపెన్‌ప్లాట్స్ యజమానులకు కమిషనర్ ఆదేశాలు



సిరిసిల్లటౌన్: ఓపెన్ ప్లాట్లలో పెరుగుతున్న పిచ్చిమొక్కలు, చెత్తను స్థల యజమానులు పది రోజుల్లోగా శుభ్రం చేయాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ సూచించారు. సోమవారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో చెత్త, చెదారం, పిచ్చిమొక్కలు, పనికిరాని పొదలు పేరుకుపోవడంతోపాటు వర్షం నీరు నిలుస్తుందన్నారు. ఫలితంగా దోమలు విజృంభించి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పది రోజుల్లోగా ప్లాట్లను శుభ్రం చేసుకోకుంటే యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘నీరు’గారుతున్నాయి!



ఇది గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశయం తూము. మానేరు జలాశయంలో నిండా నీరు ఉండడంతో ఇలా తూము లీకేజీ అవుతుంది. 100 క్యూసెక్కుల నీరు వృథాగా పోతుంది. వచ్చే ఎండాకాలం(రబీ) సీజన్‌కు ఎగువ మానేరు ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని నీటిపారుదలశాఖ అధికారులు భావిస్తుండగా.. ఇలా లీకేజీతో ఎగువ మానేరు నీరు వృథా అవుతుంది. రోజు రోజుకు ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతోంది.



ఇది కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయం. ఈ ప్రాజెక్టు కుడికాల్వ తూము ద్వారా నీరు వెళ్లిపోతుంది. నిజానికి ఇక్కడ కూడా రబీ సీజన్‌కు నీరు ఇవ్వాలని భావించగా.. కుడికాల్వలో నీరు లీకేజీ అవుతుంది. అలాగే ఎడమ కాల్వకు కూడా స్వల్ప లీకేజీలు ఉన్నాయి. ఇప్పటికీ మత్తడి ద్వారా నీరు మూలవాగులో పారుతోంది.

- నర్మాల ఎగువమానేరు తూము లీకేజీ
- నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టుకు లీకేజీల బెడద
- నీరు వృథా.. నిధులు లేక వ్యథ
- దారుణంగా చిన్న, మధ్యతరహా జలాశయాల దుస్థితి



ఎగువ మానేరుకాల్వలో పారుతున్న లీకేజీ నీరు

సిరిసిల్ల: జిల్లాలోని జలవనరులు నీరుగారిపోతున్నాయి. జలాశయాలకు లీకేజీల బెడద వెంటాడుతోంది. జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఎగువమానేరు జలాశయం తూముల లీకేజీలతో నీరు వృథాగా పోతుంది. మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల లీకేజీలతో కాల్వలు నిండుగా పారుతున్నాయి. తూములు నీరుగారిపోతుండడంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోతుంది. నీటిమట్టం తగ్గిపోతుండడంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

2 టీఎంసీలు.. 45వేల ఎకరాలు

జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు నర్మాల ఎగువమానేరు నీటి సామర్థ్యం 2 టీఎంసీలు. ఈ ప్రాజెక్టు ద్వారా గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల పరిధిలోని 45వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా.. కాల్వల నిర్వహణ సరిగ్గా లేక 10వేల ఎకరాలకు ఆయకట్టు పడిపోయింది. అధికారుల పర్యవేక్షణ లేక ప్రాజెక్టులు లీకేజీలు అవుతున్నాయి. చిన్నతరహా ప్రాజెక్టు అయిన కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయం సైతం కుడి, ఎడమ కాల్వలు లీకేజీ అవుతున్నాయి. తూము షట్టర్ల రిపేర్లు, ఆయిలింగ్, గ్రీజింగ్ పనులకు నిధుల కొరత ఉండడంతో నిర్వహణ గాలికి వదిలేశారు.

జిల్లాలో నిండిన 347 చెరువులు

జిల్లావ్యాప్తంగా 100 ఎకరాల కంటే ఎక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు 74 ఉండగా 100 ఎకరాల్లోపు ఆయకట్టు ఉన్న చెరువులు 359 ఉన్నాయి. జిల్లాలో 433 చెరువులు ఉండగా 347 చెరువులు నిండాయి. ఇందులో 24 చెరువులు మత్తడి దూకాయి. చందుర్తి మండలంలో ఒక్క చెరువు తెగిపోయింది. 50 నుంచి 75 శాతం మేరకు నిండిన చెరువులు 33 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా గతంలో గతంలో మిషన్‌కాకతీయలో భాగంగా చెరువుల కట్టలను రిపేర్లు చేసినా పూర్తి స్థాయిలో శాస్త్రీయంగా బాగుచేయలేదు. దీంతో సాగునీటి వనరులు ఉనికి కోల్పోయాయి. ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి వేసవిలో మరమ్మతు చేస్తే అమూల్యమైన సాగునీటి వృథాను కట్టడి చేసినట్లు అవుతుంది. ఆ దిశగా నీటిపారుదలశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు.



నీరుకారిపోతున్న నిమ్మపల్లి మూలవాగు జలాశయం ఎడమ కాల్వ

తూము రిపేరుకు రూ.25లక్షలు



ఎగువ మానేరు జలాశయం తూము ద్వారా నీరు వృథాగా పోతోంది. పరివాహక ప్రాంతం నుంచి కొంతమేరకు నీరు వచ్చి జలాశయంలో చేరుతోంది. దీంతో జలాశయంలో నీటి మట్టం స్థిరంగా ఉంది. తూము రిపేరుకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు ఇరిగేషన్ ఈఎన్‌సీ ద్వారా అనుమతి లభించింది. టెండర్లు పిలిచి నీటిమట్టం తగ్గిన తరువాత రింగ్ బండ్ వేసి రిపేరు చేస్తాం. జిల్లాలోని మిగతా సాగునీటి వనరుల తూముల లీకేజీలను గుర్తించి రిపేరుకు ప్రతిపాదిస్తాం. నిధులు మంజూరైతే రిపేర్లు చేస్తాం.

– అమరేందర్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఈఈ, సిరిసిల్ల

ఓటరు నమోదుకు ఈసీ గ్రీన్ సిగ్నల్

- ఇక గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ పోరు
- వేడెక్కిన ఉత్తర తెలంగాణ రాజకీయం



సాక్షిప్రతినిధి,కరీంనగర్: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎలక్షన్ కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ 30 తేదీన తుది జాబితా వెల్లడించనున్నారు. ప్రస్తుతం జరగనున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్‌లలో ఈ ప్రక్రియ సోమవారం నుంచి ఊపందుకుంది. టీచర్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ పడుతున్న ఆశావహులు ఓటరు నమోదు ప్రక్రియను ముమ్మరం చేశారు. పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పర్యటిస్తూ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలు ఒకప్పుడు నాలుగు జిల్లాలు అయినప్పటికీ ప్రస్తుతం 15 జిల్లాలుగా ఆవిర్భవించాయి. ఈ అన్ని జిల్లాలలోనూ గ్రాడ్యుయేట్లు, పలు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే బోధనా సిబ్బంది కీలకంగా మారారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులంతా పోటీ పడుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా దాదాపుగా అందరు నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగానైనా పోటీచేసే ఉత్సాహంతో ఉన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహనతో పాటు పలు వర్గాల మద్దతు కూడగట్టే విషయంలో ఉమ్మడి కరీంనగర్ అభ్యర్థులే ముందుండడం గమనార్హం. సోమవారం నోటిఫికేషన్ వెలువడిన దరిమిలా వీరి సంఖ్య మరింత పెరగనుంది.

విన్నపాలు ఆలకించండి

- కలెక్టరేట్ బాట పట్టిన బాధితులు
- ప్రజావాణిలో అర్జీలు
- ఎప్పటికప్పుడు పరిష్కరించండి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లఅర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో పలువురు బాధితులు కలెక్టరేట్ బాట పడుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు విన్నవించుకున్నారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూకు 47, సిరిసిల్ల మున్సిపల్‌కు 7, డీపీవో 3, ఉపాధి కల్పన 5, జిల్లా సంక్షేమశాఖ 2, తంగళ్లపల్లి ఎంపీడీవో 2, గంభీరావుపేట ఎంపీడీవో 7, ముస్తాబాద్ ఎంపీడీవో 1, ఇల్లంతకుంట ఎంపీడీవో 2, డీఆర్‌డీవో 6, ఆర్ అండ్‌బీ, వ్యవసాయశాఖ, ఎక్సైజ్ శాఖ, పౌరసరఫరాల శాఖలకు 3, నీటి పారుదలశాఖ, విద్యాశాఖ, ఎస్పీ ఆఫీస్‌లకు 2, ఎల్‌డీసీ, ఎస్‌డీసీ, ఎంహెచ్‌వో, డీఎస్‌సీడీవో, సర్వే, ట్రెజరీ, సెస్, డీపీఆర్‌వోలకు ఒకటి చొప్పున 102 దరఖాస్తులు వచ్చాయి.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఉద్యోగం ఇప్పించండి



నా భర్త బత్తుల నరేశ్‌కు క్యాన్సర్ వచ్చి ఒక కాలు తీసివేశారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. మాది చాలా పేద కుటుంబం. నా భర్తకు మందులు కొనడానికి కూడా డబ్బులు లేవు. మధ్యాహ్న భోజన పథకంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పించండి. – బత్తుల నరేశ్ భార్య, ఆవునూరు

ఎలక్ట్రిక్ స్కూటీ ఇప్పించండి



నేను 87 శాతం అంగవైకల్యంతో మార్కెట్‌పల్లిలో కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తున్నాను. నడువలేక ఇబ్బంది పడుతున్నాను. దయచేసి నాకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇప్పించండి. – పందుగు పోచయ్య, జంగారెడ్డిపల్లి

నా కొడుకులను ఇంటి నుంచి ఖాళీ చేయించండి



నా భర్త చనిపోయిన తర్వాత నా ముగ్గురు కొడుకులు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇంటి కిరాయి డబ్బులు తీసుకుంటున్నారు. ఇదేంటని అడిగితే నన్ను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. నా కొడుకులను నా ఇంటి నుంచి ఖాళీ చేయించండి. – ఫహీమున్నీసా బేగం, గాంధీనగర్, సిరిసిల్ల

భూకబ్జాపై చర్యలు తీసుకోండి



గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేటలో నకిలీ పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. దాదాపు ఎకరం భూమి ఉంది. ఏళ్లుగా అక్కడే ఉత్సవాలు నిర్వహించుకుంటాం. గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఉండేది. గ్రామ నడిబొడ్డున ఉండడంతో కొందరు కబ్జా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలి. – మల్లారెడ్డిపేట గ్రామస్తులు



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, బంధువులను శాంతింపజేస్తున్న ఆర్డీవో, ఏఎస్పీలు

టాటా..బైబై.. చెప్పిన అరగంటలోనే..

- బస్సు కింద పడి చిన్నారి దుర్మరణం
- స్కూల్ గ్రౌండ్‌లోనే సంఘటన
- బతుకమ్మ సంబరాలకు వచ్చి తెల్లారిన ‘బతుకు’
- రాజన్నసిరిసిల్ల జిల్లా నామాపూర్‌లో విషాదం



విలపిస్తున్న తల్లి వెంకటలక్ష్మి

ముస్తాబాద్(సిరిసిల్ల): ‘మమ్మీ మా స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు ఉన్నాయి. నేను పట్టులంగా వేసుకుంటాను. బతుకమ్మ ఆడతాను..’ అంటూ ఎంతో ఉత్సాహంగా ముస్తాబై, స్కూల్‌కు వెళ్లిన చిన్నారి అంతలోనే కానరానికి లోకాలకు వెళ్లిపోయింది. టాటా.. బైబై.. చెప్పిన అరగంటలోనే మృత్యువు స్కూల్‌బస్సు రూపంలో వచ్చింది. ఈ సంఘటన ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం జరుగగా.. నామాపూర్‌లో విషాదం నింపింది. మరో నిమిషమైతే క్లాస్‌రూమ్‌కు చేరుకునే చిన్నారికి ఐదేళ్లకే నూరేళ్లు నిండాయి.



మనోజ్ఞ(ఫైల్)

ఐదేళ్లకే నూరేళ్లు

రాజన్నసిరిసిల్ల ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన సల్కం భూమయ్య–వెంకటలక్ష్మి దంపతులకు పెళ్లై పదహారేళ్లు గడిచినా సంతానం కలగలేదు. దీంతో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం మల్లయ్యపల్లెకు చెందిన బంధువుల కూతురు మనోజ్ఞ(5)ను దత్తత తీసుకున్నారు. మనోజ్ఞ జన్మించిన మూడు రోజులకే కన్నతల్లి కన్నుమూసింది. దత్తత తీసుకున్న వెంకటలక్ష్మి–భూమయ్య దంపతులు చిన్నారిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. మనోజ్ఞను ముస్తాబాద్‌లోని మహర్షి పాఠశాలలో నర్సరీలో చేర్పించారు. వారం రోజులుగా పాఠశాలకు వెళ్లని చిన్నారి.. బతుకమ్మ సంబరాల కోసమని స్కూల్ బస్సులో పాఠశాలకు చేరుకుంది. బస్సులోని విద్యార్థులు, క్లీనర్ బతుకమ్మ పూలతో తరగతిగదికి వెళ్లగా.. మనోజ్ఞకు కింద పడ్డ పూలు కనిపించడంతో వాటిని తీసేందుకు వంగింది. ఇది గమనించని బస్సు డ్రైవర్ గురుమూర్తి ముందుకు కదిలించాడు. దీంతో మనోజ్ఞ తలపై నుంచి బస్సు టైరు వెళ్లింది. అక్కడికక్కడే మనోజ్ఞ ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న తల్లి వెంకటలక్ష్మి పాఠశాలకు చేరుకుని గుండెలవిసేలా విలపించింది. ‘అరగంటే కిందే బైబై మమ్మీ.. అని చెప్పి కన్ను మూశావా బిడ్డా..’ అంటూ రోదించడం కలచివేసింది. మనోజ్ఞ మృతదేహం పక్కనే లంచ్‌బాక్స్ పడి ఉండడం.. అక్కడి వారిని కంటతడి పెట్టించింది. చిన్నారి తండ్రి భూమయ్య ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లగా.. కడసారి చూపునకు నోచుకోలేదు.

విద్యార్థి సంఘాల ఆందోళన.. పోలీసుల బందోబస్తు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రంజిత్, భాను, రాకేశ్ తదితరులు పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. ఆర్డీవో రమేశ్, డీఈవో రమేశ్‌కుమార్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై గణేశ్ పోలీసులు పాఠశాలకు చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు. బాధితులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్కూల్‌ను సీజ్ చేస్తామని అధికారులు హామీ ఇవ్వగా, పాఠశాల యజమాన్యం బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. కాగా చిన్నారి మనోజ్ఞ దుర్మరణంతో నామాపూర్‌లో విషాదం అలుముకుంది. ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు లేవని, డీటీవో, డీఈవోల నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని నాయకులు ఆరోపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేశ్ తెలిపారు.

రాజన్న ప్రసాదంగా భావించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రెండో విడత కోడెల పంపిణీ

వేములవాడఅర్బన్: రైతులు కోడెలను రాజన్న ప్రసాదంగా భావించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. తిప్పాపూర్ గోశాలలోని కోడెలను రెండో విడతగా సోమవారం రైతులకు ఉచితంగా పంపిణీ చేసి, మాట్లాడారు. శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో కోరిన కోర్కెలు తీరాలని భక్తులు కోడె మొక్కులు చెల్లిస్తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో అర్హులైన రైతులకు రెండో విడత కోడెలను అందిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల క్రితం సుమారుగా 1,600 కోడెలను రైతులకు పంపిణీ చేశామన్నారు. అర్హులకు మాత్రమే అందేలా కమిటీ ఏర్పాటు చేసి, లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, తహసీల్దార్ మహేశ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



రైతుకు కోడె అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

రూ.100 కోట్లకు చేరువలో డిపాజిట్లు



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ లక్ష్మీనారాయణ

సిరిసిల్లటౌన్: వినియోగదారుల సహకారంతో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ రూ.100కోట్ల డిపాజిట్లకు చేరువలో ఉందని చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక పద్మశాలీ కల్యాణ ట్రస్టు భవనంలో సోమవారం నిర్వహించిన 38వ వార్షిక సభలో మాట్లాడారు. సహకార స్ఫూర్తితో కస్టమర్లకు పారదర్శక సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరంలో బ్యాంకు రూ.86లక్షలకు పైగా లాభాలు గడించిందని వివరించారు. బియ్యంకార్ శ్రీనివాస్‌తోపాటు పలువురు మాట్లాడుతూ.. బ్యాంకు ఉద్యోగులకు పీఆర్సీ, సభ్యులకు డివిడెండ్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగి స్థానంలో సీఈవోగా రెగ్యులర్ ఉద్యోగిని నియమించడంతోపాటు వేతనాన్ని రూ.58వేల నుంచి రూ.25వేలకు తగ్గించాలని సూచించారు. సభ్యులు పలు అంశాలపై అభ్యంతరాలు తెలిపారు. బ్యాంకు వైస్‌చైర్మన్ అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్‌రాజు, బుర్రరాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాసు, ఎనగందుల శంకర్, వలుస హరిణి, పత్తిపాక సురేశ్, కోడం సంజీవ్, సీఈవో పత్తిపాక శ్రీనివాస్, మాజీ చైర్మన్లు గూడూరి ప్రవీణ్, గాజుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఎంబీఏ విద్యార్థి మృతి


నవీన్(ఫైల్)

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఎల్లకొండ నవీన్(24) అనే ఎంబీఏ ఫస్టియర్ విద్యార్థి సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఛాతిలో నొప్పి, వాంతితో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు కోరుట్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అప్పటి వరకు చలాకీగా తిరిగిన యువకుడు అంతలోనే విగతజీవిగా మారడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని వెంకట్రావుపల్లి పరిసరాల్లో సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఎల్లయ్య(68) అనే వృద్ధుడు గాయపడ్డాడు. బస్టాండ్ ప్రాంతంలో ఎల్లయ్య కిరాణషాపులో సామాను తీసుకుని రోడ్డు దాటుతున్నాడు. సిరిసిల్ల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ ఎల్లయ్యను చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

బైక్, ఆటోను ఢీకొట్టిన ట్రాలీ ఆటో

- నలుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వెంకటాపూర్ శివారులోని పెట్రోల్‌బంక్ సమీపంలో కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న బైక్, ఆటోలను ట్రాలీఆటో వేగంగా ఢీకొట్టింది. వెంకటాపూర్‌కు చెందిన రాగుల చందు, పులి బాలయ్య వస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో ఢీకొట్టి, అదే వేగంతో సిరిసిల్ల నుంచి వస్తున్న ప్యాసింజర్ ఆటోను సైతం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో డ్రైవర్ బాలసంతుల పర్శయ్య, పులి బాలయ్యలను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న రావుల చందు, సంత్‌ను కరీంనగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీలో మెరిశారు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పేదింటి కుసుమాలు మెరిశాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పలువురు వ్యవసాయ, పేద కుటుంబాలకు చెందినవారు మంచి మార్కులు సాధించి వారి కుటుంబాల్లో ఆనందం నింపారు. కొందరు వైకల్యాన్ని జయించి సత్తాచాటారు.

జిల్లాస్థాయిలో ఫస్ట్‌ర్యాంక్


రవికుమార్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని కోజన్‌కొత్తూర్‌కు చెందిన అయితే రవికుమార్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన అయితే రాములుకు ఇద్దరు కుమారులు. వీరిది వ్యవసాయ కుటుంబం. పెద్ద కుమారుడు మహేందర్ కొంత కాలం క్రితం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపికయ్యాడు. రెండో కుమారుడైన రవికుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీజీ(ఇంగ్లిష్) పూర్తి చేశాడు. డీఎస్సీలో ఎంపికతో గురుకుల పోస్టుకు రాజీనామా చేసి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా జాయిన్ అవుతానని రవికుమార్ పేర్కొన్నారు.

పేద కుటుంబంలో విద్యాకుసుమం


రజిత

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని చీమలకుంటపల్లెకు చెందిన తాళ్లపెల్లి రజిత 7వ ర్యాంకు సాధించింది. తండ్రి రాజయ్యగౌడ్ కులవృత్తి, తల్లి రాధ కూలీ పనులు చేస్తుంటారు. 1 నుంచి 5వ తరగతి గ్రామంలో, 10వ తరగతి వరకు వడ్లూరుబేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో చదవింది. పదిలో 526 మార్కుల సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఇంటర్ గుండ్లపల్లి స్టేజీ వద్ద సద్గురు కళాశాల, డీఈడీ తిమ్మాపూర్ మండలం రామకృష్ణాకాలనీ జ్యోతిష్మతి (షాలినీ కాలేజీ ఆఫ్ ఎడ్యూకేషన్)లో పూర్తి చేసింది. టీఈటీలో 133 మార్కులు సాధించింది. డీఎస్సీలో జిల్లాలో ఏడో ర్యాంకుతో సత్తాచాటింది. కాగా ఐదేళ్ల క్రితం ఇల్లంతకుంటకు చెందిన అంతటి చందుగౌడ్‌తో వివాహం జరిగింది. భర్త ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు.

ధర్మపురి వాసుల ప్రతిభ

గొల్లపల్లి(ధర్మపురి): డీఎస్సీలో ధర్మపురి అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో మాడిశెట్టి అభిషేక్ జిల్లా మొదటి ర్యాంక్, గడిపల్లి మమత ఎస్జీటీ విభాగంలో 11వ ర్యాంక్, మెరుగు రామచంద్రం తెలుగులో 4వ ర్యాంక్ సాధించారు. మొదటి ర్యాంక్ సాధించిన అభిషేక్ టైలర్ వృత్తి చేస్తున్నాడు.

అంధత్వాన్ని జయించి..


రేవతి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి రేవతి డీఎస్సీ ఫలితాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు సాధించింది. పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన పాతూరి శ్రీనివాస్‌రెడ్డికి ఇద్దరు కూతుర్లు. చిన్నమ్మాయి రేవతి పుట్టుకతో వంద శాతం అంధత్వం. మూడో తరగతి వరకు గ్రామంలో చదివింది. బాబాయ్ పాతూరు మహేందర్‌రెడ్డి ఉపాధ్యాయుడు కావడంతో రేవతిలో ఉన్న జ్ఞానాన్ని గ్రహించి కరీంనగర్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించారు. హైదరాబాద్‌లో ఇంటర్, గ్రాడ్యుయేషన్, టీటీసీ(డీఎడ్) పూర్తి చేసింది. టెట్‌లో మంచి మార్కులు పొంది ప్రస్తుతం డీఎస్సీలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించింది. తన తండ్రి, అక్క, బావ ప్రోత్సాహంతో ఇది సాధ్యమైనట్లు తెలిపింది.

ఆరోసారికి దక్కిన విజయం


చంద్రశేఖర్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన కోడం చంద్రశేఖర్ ఐదుసార్లు డీఎస్సీ రాసినా ఫలితం లేకపోవడంతో నిరాశ చెందలేదు. పట్టుదలతో ఆరోసారి రాసిన పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచాడు. పేద చేనేత కుటుంబంలో జన్మించిన ఆయన ఎన్నో ఒడిదుడుకులను ఎదిరించారు. ప్రస్తుతం వేములవాడ బీసీ గురుకులంలో టీజీటీ సోషల్ సబ్జెక్టు బోధిస్తున్నాడు.

వ్యాయామ విద్యా విభాగంలో..


అఖిల్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ జిల్లా చింతకుంటకు చెందిన వి.పూర్ణసాయి అఖిల్ వ్యాయామ విద్య విభాగంలో 55 మార్కులు సాధించి జిల్లాలో 2వ ర్యాంకు సాధించాడు. అఖిల్‌ను జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీం, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కోశాధికారి సిద్ధారెడ్డి అభినందించారు.

సామాన్య కుటుంబం నుంచి..


నివేదితరెడ్డి


ప్రజ్ఞారెడ్డి


నాగరాజు


నరేందర్‌రాజు

మల్లాపూర్(కోరుట్ల): సామాన్య కుటుంబానికి చెందిన పలువురు డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల గంగారాం–లక్ష్మి దంపతుల కుమారుడు నాగరాజు ఎస్జీటీ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. అదే గ్రామానికి చెందిన గణపతి నరేందర్‌రాజు స్కూల్ అసిస్టెంట్(సోషల్) విభాగంలో జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించాడు. అలాగే నడికుడ గ్రామానికి చెందిన కోరిపెల్లి నర్సారెడ్డి–కాంతమ్మ దంపతుల కుమార్తె నివేదిత ఎస్జీటీ విభాగంలో 4వ ర్యాంక్, అదే గ్రామానికి చెందిన కోరిపెల్లి ప్రజ్ఞ ఎస్జీటీలో 77వ ర్యాంక్ సాధించారు.

మొదటి ప్రయత్నంలోనే సక్సెస్


తల్లిదండ్రులతో శ్రీకాంత్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లికి చెందిన బెదిరె శ్రీకాంత్ డీఎస్సీలో మొదటి ప్రయత్నంలోనే విజయం అందుకున్నాడు. జిల్లా స్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు. గ్రామానికి చెందిన బెదిరె కుంటయ్య–మీన దంపతుల కుమారుడు శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

పేదింటి బిడ్డకు రెండో ర్యాంకు


కుటుంబ సభ్యులతో కుమార్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని గంగారం గ్రామపంచాయతీ పరిధి ఊశన్నపల్లెకు చెందిన బండారి కుమార్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు కొమురమ్మ–దుర్గయ్య వ్యవసాయ కూలీలు. ఒకటి నుంచి 10 వరకు ప్రభుత్వ స్కూళ్లల్లో చదివాడు. 2001–02లో పదిలో 524 మార్కులు సాధించగా, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఇంటర్‌లో ఉచితంగా అవకాశం కల్పించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్యలో బీఎస్సీ, బీఈడీ, పీజీ చేశాడు. కరీంనగర్ డైట్‌లో టీటీసీ పూర్తి చేసి ఎస్జీటీగా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. తన తల్లిదండ్రుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల అభ్యుదయం కోసం కృషి చేస్తానని కుమార్ పేర్కొన్నాడు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా నిలవాలి


పోషణ ఆరోగ్య జాతర బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న మంత్రులు సీతక్క, ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

కరీంనగర్: పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు దేశంలోనే ఆదర్శ నిలవాలని మంత్రి సీతక్క కోరారు. కరీంనగర్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో నూతన సిలబస్‌తో విద్య, నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తల్లిదండ్రులకు చెప్పాలని, పిల్లలను పంపేలా చూడాలన్నారు. గర్భిణులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాజీపడొద్దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లేకుంటే కాంట్రాక్టర్ల అనుమతులు రద్దు చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నవారికి ఈ నెల 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో అభినందన సభ నిర్వహిస్తామని తెలిపారు. అంతకుముందు మానకొండూర్‌లో పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రామచంద్రన్, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష, రాజన్నసిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి పాల్గొన్నారు.

నిధుల్లేక నిలుస్తున్న బల్దియా ప్రగతి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో బల్దియాలో అభివృద్ధి కుంటుపడుతుందని చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సోమవారం కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలోని దామోదరం సంజీవయ్య విగ్రహాన్ని పాతబస్టాండు ఏరియాలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల మధ్య గల డివైడర్‌లోకి మార్చడానికి తీర్మానించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్‌కు ఇవ్వాల్సిన కిట్లు, చీరలు, యూనిఫాం డ్రెస్సులు, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, తువ్వాలలకు అందించేందుకు రూ.19లక్షలు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, కొత్తవాటి నిర్మాణానికి రూ.25లక్షలు, డ్రెయినేజీ, కల్వర్టుల నిర్మాణం, నిర్వహణకు రూ.8లక్షలు పరిపాలనపరమైన మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. ఎజెండాలోని 12 అంశాలను ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

- తన చావుకు ఎవరూ కారణం కాదంటూ సూసైడ్ నోట్
- ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య


గంగ ఉరఫ్ కీర్తిశ (ఫైల్)

చందుర్తి (వేములవాడ): భార్య కాపురానికి వస్తే చనిపోతానన్న భర్త మాటలు... ప్రియుడితో కలిసి బతుకలేకపోతున్నానని మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చందుర్తి మండలం లింగంపేటలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు. చందుర్తి మండలం లింగంపేటకు చెందిన గంగ(21) ఉరఫ్ కీర్తిశకు వేములవాడఅర్బన్ మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన దేవరాజుతో 2023 మే 13న వివాహమైంది. ఏడాదిపాటు సంసారం సాఫీగా సాగింది. భార్యభర్తల మధ్య మనస్థాపాలు రావడంతో పుట్టింటికొచ్చింది. గత జూన్ 2వ తేదీన అత్తారింటికి వెళ్తున్నానని చెప్పి బయలుదేరింది. అత్తారింటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు మరుసటి రోజు చందుర్తి ఠాణాలో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత జూన్ 18వ తేదీన హైదరాబాద్ నుంచి పోలీసులు ఇంటికి తీసుకొచ్చారు. తిరిగి అత్తగారింటికి కాపురానికి వెళ్లింది. అయితే ఆమెలో మార్పు రాకపోగా ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుండడంతో వివాదం ముదిరింది. దీంతో నెల రోజుల క్రితమే పుట్టింటికి చేరుకుంది. కొద్ది రోజులుగా గొడవలతో దూరంగా ఉంటున్న క్రమంలో తాజాగా ఆదివారం పంచాయితీ పెట్టారు. భార్యను కాపురానికి తీసుకొస్తే తాను చనిపోతానని భర్త దేవరాజు అనడంతో మనస్థాపానికి గురైంది. ఈక్రమంలో ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలు తల్లి మంజుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాపు తెలిపారు. మృతురాలు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ప్రియుడిని తలచుకుంటూ మూడు పేజీల సూసైడ్‌నోట్ రాసింది.


ఆలయ ఆవరణలో భక్తులు

రాజన్నకు మొక్కులు



వేములవాడ: రాజన్నకు సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. సోమవారం భక్తుల రద్దీ పెరిగిపోవడంతో గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. బ్రేక్ దర్శనాలు కొనసాగించారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు, పర్యవేక్షకులు పరిశీలించారు.



నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

- జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఇటీవల టీచర్ల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను సోమవారం విడుదల చేయగా.. మంగళవారం నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 151 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్ష నిర్వహించారు. 4,283 మంది పరీక్ష హాజరయ్యారు. ఎస్జీటీ 76, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 75 భర్తీ చేయనున్నారు. 1:3లో అభ్యర్థుల జాబితాను సిరిసిల్ల డీఈవో అధికారిక వెబ్‌సైట్ అందుబాటులో ఉంచారు. అక్టోబర్ 1 నుంచి 4 వరకు సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని డీఈవో వివరించారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

- 'సెస్' ఎండీ శ్రీనివాస్‌రెడ్డి



సిరిసిల్ల: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం కోరారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు కొందరు బిల్లులు చెల్లించకుండా బకాయిలు ఉన్నారని వివరించారు. వెంటనే విద్యుత్ బిల్లులను చెల్లించి 'సెస్' సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎవరికైనా ఎక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉంటే.. మూడు, నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లులు బకాయిలు పడిన వినియోగదారులు చెల్లించాలని కోరారు. విద్యుత్ బిల్లులను పెండింగ్‌లో పెడుతూ.. చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తే 'సెస్' క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకుంటారని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

సభకు భారీగా తరలిరావాలి

- మాదిగ జేఏసీ నాయకుడు దేవదాను

సిరిసిల్లటౌన్: తమ చిరకాల స్వప్నం నెరవేరుబోతున్న తరుణంలో సిరిసిల్లలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాదిగలు, ఉపకులాల జేఏసీ తీర్మానించింది. ఈమేరకు సోమవారం సిరిసిల్లలోని కే కన్వెన్షన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. భారీగా తరలిరావాలని కోరారు. కత్తెర దేవదాస్, కొల్లూరి ధర్మేందర్, ఖానాపురం లక్ష్మణ్, ఆవునూరి వెంకట్రాములు, గుండా థామస్, ఆవునూరి ప్రభాకర్, గుండేటి రాజు, నేదునూరి లక్ష్మణ్, కొమ్ము బాలయ్య, తాళ్లపల్లి ప్రభాకర్, గడ్డం కిరణ్ పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై కేసు పెట్టాలి



సిరిసిల్లటౌన్: విద్యార్థిని స్కూల్ బస్సు బలిగొన్న సంఘటనలో యాజమాన్యంపై కేసు పెట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బీసీ విద్యార్థి సంఘం, కేవీపీఎస్(కులవివక్ష పోరాట సమితి) జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజులు సోమవారం వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. విద్యార్థిని కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. మట్టె శ్రీనివాస్, వెంకటేశ్, అనిల్, సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఒకే నంబర్ ప్లేట్‌తో రెండు ద్విచక్రవాహనాలు



తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని మానేరు నది వంతెనపై ఒకే నంబర్ ప్లేట్‌తో రెండు బైక్‌లు కనిపించాయి. దీనిపై స్పందించిన పోలీసులు ఒకే నంబర్(టీఎస్ 02 ఈఎల్ 9059)తో రెండు బైక్‌లు తిరగడంపై ఆరా తీశారు. ఆ రెండు బైక్‌లను సీజ్‌చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి సోమవారం ఎల్ఎండీకి 2,040 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరదకాల్వ మీదుగా 3,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 26.60 టీఎంసీల నీరు ఉంది.

న్యాయవాదుల నిరసన



వేములవాడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వేములవాడలో న్యాయవాదులు సోమవారం నిరసన తెలిపారు. న్యాయవాదులు సదానందం, అవదూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, కేశన్నగారి గోపీకృష్ణ, కిశోర్‌రావు, రేగుల దేవేందర్, నక్క దివాకర్, జంగం అంజయ్య, పర్లపెల్లి అంజయ్య, గడ్డం సత్యనారాయణరెడ్డి, సంటి సుజీవన్, పారువెల్ల శ్రీనివాస్, పంపరి శంకర్, నేదూరి అభిలాష్, జెట్టి శేఖర్ పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్క దాడి

రుద్రంగి(వేములవాడ): దెగావత్‌తండాకు చెందిన గుగులోతు దివ్య అనే చిన్నారిపై సోమవారం కుక్క దాడి చేసింది. ఇంటి ముందు అన్నం తింటుండగా వీధికుక్క దాడిచేసింది. చందుర్తి ఆస్పత్రిలో చికిత్స అందించారు.

డబుల్ ఇళ్లు పంపిణీ చేయాలి

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్లలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు రాని వారికి రూ.5 లక్షలు ఇస్తామని 44 మందికి పట్టాలు ఇచ్చి స్థలం చూపించలేదన్నారు. ఈమేరకు మంజూరు చేయాలని కోరారు. కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, సావనపెల్లి రాములు, సురేశ్, పోచమల్లు, రూప, లావణ్య, స్వప్న, తిరుపతి, బాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: విదేశాల్లో పీజీ పీహెచ్‌డీ చదివే ఎస్సీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీడీవో విజయలక్ష్మి తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 35 ఏళ్ల లోపు, డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. వివరాలకు జిల్లా ఎస్సీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు దారి

ఇల్లంతకుంట(మానకొండూర్): మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలకు దారి సమస్య పరిష్కారమైంది. సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి అధికారులకు సూచించారు. ఈ మేరకు తహసీల్దార్ ఎంఏ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, వీఆర్‌వో సింగారెడ్డి, సర్వేయర్‌తో దారి ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా దారి లేక డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ జరగలేదు.

హత్య కేసులో ఐదుగురి రిమాండ్

వేములవాడ: వేములవాడకు చెందిన మామిండ్ల మల్లయ్యను ఆస్తి విషయంలో హత్యకు పాల్పడిన ఐదుగురిని సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని చెక్కపెల్లి రోడ్డులో ఆదివారం జరిగిన మల్లయ్య హత్యతోపాటు అతని రెండో భార్య పద్మను గాయపరిచిన నిందితులు మామిండ్ల రాజు, అత్తిలి జమున, లంబ మౌనిక, అత్తిని రాజేందర్, లంబ బాలకృష్ణలు పరారీలో ఉండగా సోమవారం రాత్రి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు.